సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

కడప నగరంలో నిర్వహిస్తున్న వన్డే క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. గురువారం విజయనగరం, సెంట్రల్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. -8లో..



సంవేదనలో సరికొత్త ఉదయం

హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన వీర జవాన్ సాయితేజ భార్యకు ప్రభుత్వం స్థలం, ఉద్యోగం ఇచ్చి అండగా నిలిచింది . -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.124
రెండోరకం	రూ.56	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 410 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రేపు బ్యాడ్మింటన్ టోర్నీ

నందలూరు (రాజంపేట): నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే సంగ్ కార్యాలయం వద్ద ఈనెల 30వ తేదీన వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల స్థాయిలో షటిల్ టోర్నమెంట్ జరగనుంది. ఈ విషయాన్ని నిర్వాహకులు శ్రీధర్, పీఈకే మూర్తి, రవిశంకర్‌లు గురువారం తెలిపారు. ఇందులో పాల్గొనేవారు రూ. 500లు ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు.విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేస్తామని చెప్పారు. మరిన్న వివరాలకు 9494755105, 8500227890 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్‌ఎం'

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులు 99592 25848 నంబరుకు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు.

30న 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కడప కోటిరెడ్డిసర్కిల్: ఈనెల 30వ తేది నుంచి జరిగే 'జగనన్న ఆరోగ్య సురక్ష'కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అధికారులకు సూచించారు. గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో స్పెషలిస్టు వైద్యుల సమాచారం, మండల తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకోవడం, మెటీరియల్ అందుబాటులో ఉంచడంతదితర వాటి గురించి చర్చించామన్నారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సిబ్బంది అందు బాటులో ఉండాలని సూచించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మహేశ్వర్ కు మార్, జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక రైలు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: హైదరాబాద్–తిరుపతి–హైదరాబాద్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును మరో రెండు నెలలపాటు పొడిగించారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. హైదరాబాద్–తిరుపతి (07643) రైలు ప్రతి సోమవారం రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లిలో బయలుదేరి సికింద్రాబాద్, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్, గద్వాల్, కర్నూలు సిటీ,డోన్; గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల మీదుగా కడపకు మరుసటిరోజు తెల్లవారుజామున 5.50 గంటలకు చేరుకుంటుంది. తిరుపతికి 10.00 గంటలకు వెళుతుందన్నారు. తిరిగి అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతిలో అదే రైలు (07644) బయలుదేరి కడపకు సాయంత్రం 5.05 గంటలకు వస్తుంది. మరుసటిరోజు తెల్లవారుజాము 5.00 గంటలకు హైదరాబాదు చేరుతుందన్నారు. ఈ రైలు నవంబరు 28వ తేదీ వరకు వారానికి ఒకరోజు మాత్రమే నడుస్తుందన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ రైలును పొడిగించారన్నారు.

మల్లయ్యకొండపై అభివృద్ధి పనులకు అవకాశం



వ్యూపాయింట్‌ను పరిశీలిసున్న కన్సల్టెంట్లు అభిషేక్, వంశీ

తంబళ్లపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై అభివృద్ధి పనులు చేపట్టేందుకు అన్ని విధాలా అవకాశం ఉందని టూరిజం శాఖ కన్సల్టెంట్లు అభిషేక్, వంశీలు వెల్లడించారు. బుధవారం వారు మల్లయ్యకొండను సందర్శించారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు వారికి స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మల్లయ్యకొండపై దర్శనీయస్థలాలు నిశ్చెనకొండ, వీరన్నగుహ, భగీరథజలం, గౌరమ్మ ఆలయం, జలకతీర్థం, వెలుగుమల్లమ్మ ఆలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గౌరమ్మగుట్టపై గుర్తించిన వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. అక్కడే పారాయివాని అరుగు ప్రాంతాన్ని పరిశీలించి అభివృద్ధి పనులు చేసేందుకు అనుకూలంగా ఉందని నిర్ధారించారు. వారి పరిశీలన నివేదికలను టూరిజం శాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వారి వెంట వైస్ ఎంపీపీ కరీమ్, బీసీ నాయకులు రామూర్తి, మెడికల్‌షాపు నారాయణరెడ్డి, గంధర్వరెడ్డి, కొండకిట్ట, సహదేవ తదితరులు ఉన్నారు.

పెద్దదర్గాలో అన్నదానం

కడప కల్చరల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ)జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం కడప నగరంలోని 50 ప్రాంతాలలో అన్నదానాలు నిర్వహించారు. కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో బార్మి అన్నదానం నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆశీస్సులతో దర్గా భక్తులు పెద్ద సంఖ్యలో తెల్లవారుజాము నుంచి దర్గాలో అన్నప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

ఆటోకు ఇంధనం

- జిల్లాలో 7990 మంది వాహన దారులకు ప్రయోజనం
- ఐదో విడతలో అధిక మందికి ఆర్థిక సాయం
- నేడు బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్





ఆటో డ్రైవర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి రాయచోటి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్న ప్రభుత్వం వాహన దారులకు అండగా నిలిచింది. పేదల బతుకుల్లో వెలుగులు నింపుతూ వాహనాలను నడుపుకొనేందుకు చేయూత అందిస్తోంది. వెనుకబడిన ఆటో, క్యాబ్ యజమానులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పిస్తూ నేడు బటన్‌నొక్కి ఐదో విడతగా వారి ఖాతాలకు ఆర్థిక సాయం జమ చేయనున్నారు. ఎంతో కొంత వారి వాహన నిర్వహణకు సరిపోతుందన్న ఆలోచనతో ఈ సాయం అందిస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక రవాణా శాఖ ఇప్పటికే పూర్తి చేసింది. వరుసగా ఐదో ఏడాది అర్హులైన ఒక్కొక్క ట్యాక్సీ, క్యాబ్, ఆటో వాలాలకు ఐదో విడతగా ఈ ఏడాది రూ.10,000 చొప్పున అందిస్తున్నారు. ఏటా లబ్ధిదారుల సంఖ్య పెరుగుతున్నా.. అర్హులందరికీ అందించాలనే సంకల్పంతో ముందడుగు వేస్తోంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 7990 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.7.99 కోట్లు జమ చేయనున్నారు.

- వాహనాలకు సంబంధించి ఎదురయ్యే ఇబ్బందులకు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం అండగా నిలుస్తోంది. 2019 నుంచి ఇప్పటివరకు నాలుగు

జిల్లాలో వైఎస్ఆర్ వాహన మిత్ర లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	4946	4.94
2020-21	7350	7.35
2021-22	7338	7.33
2022-23	7563	7.56
2023-24	7990	7.99

విడతల్లో జిల్లాలోని అనేక మంది చిన్నపాటి వాహన యజమానులకు ఎంతో ప్రయోజనం కలిగింది. ట్యాక్సీ, క్యాబ్ వాహన దారులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఎంతో కొంత వాహన నిర్వహణ ఖర్చులకు సరిపోతుందన్న ఆలోచనతో ప్రతియేడాది ఆర్థికసాయం అందిస్తోంది.

- శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో జరిగే బహిరంగసభలో బటన్ నొక్కి ప్రారంభించగానే అధికారులు ఆ మొత్తాలను ఖాతాలకు జమచేయనున్నారు. వాహనదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు. ఇప్పటికే అర్హత కలిగిన వారు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

అర్హులందరికీ వాహన మిత్ర



జిల్లాలో అర్హులైన ఆటో రిక్షా, ట్యాక్సీ క్యాబ్ తోపాటు డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారికి వాహన మిత్ర పథకాన్ని అందిస్తున్నాం. మొన్నటి వరకు అర్హుల దరఖాస్తులు స్వీకరించాం. ఒక్కొక్కరికి రూ. 10 వేలు అందించనున్నాం. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా తోపాటు ప్రజాప్రతినిధులు అందజేయనున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు హాజరు కానున్నారు.

– పి.దినేష్ చంద్ర, జిల్లా రవాణా శాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

అక్టోబరు 3 నుంచి ఫార్మేటివ్–2 పరీక్ష

- ప్రధానోపాధ్యాయుల ఈ-మెయిల్‌కు ప్రశ్నపత్రం
- నిర్వహణ ఏర్పాట్లలో జిల్లా విద్యాశాఖ



తరగతి గదిలో విద్యార్థులు

మదనపల్లె సిటీ: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను వెలికి తీసేందుకు నిర్వహించే ఫార్మేటివ్–2 పరీక్ష నిర్వహణకు విద్యా శాఖ సిద్ధమవుతోంది. అక్టోబర్ 3వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు గత నెల 1వతేదీ నుంచి 4వతేదీ వరకు జరిగాయి. ఫార్మేటివ్–1 పరీక్షను క్లాస్ రూమ్ బేస్డ్ విధానంలో, ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా, ఫార్మేటివ్–2 పరీక్షను పాత విధానంలో జరుపనున్నారు.

- ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్షా పత్రం ద్వారానే ఫార్మేటివ్–2 పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రశ్న పత్రాన్ని బ్లాక్ బోర్డుపై ఉపాధ్యాయులు రాస్తారు. విద్యార్థులు చూసి పేపర్‌లో నమోదు చేసుకుని సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఎఫ్‌ఏ–2 పరీక్షకు ప్రింటెడ్ పేపర్ల సరఫరా లేదు. అన్ని మేనేజ్‌మెంట్ల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష పేపర్లను మెయిల్‌లో పంపిస్తారు. ఆ పేపర్లను సంబంధిత ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది.

పరీక్షలు ఏఏ తేదీల్లో...

- అక్టోబర్ 3, 4వ తేదీల్లో, 1–5వ తరగతి వరకు విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహిస్తారు. 3న తెలుగు, గణితం, 4న ఈవీఎస్, ఇంగ్లీష్ పరీక్షలు నిర్వహిస్తారు. 5న 3–5 తరగతుల విద్యార్థులకు ఓఎస్ఎస్‌సీ పరీక్ష ఉదయం నిర్వహిస్తారు.

సమయం: ఉదయం 9.30 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 1.20 నుంచి 2.20 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లీష్ పార్ట్–బి మధ్యాహ్నం 2.30 నుంచి 2.50 గంటల వరకు నిర్వహించనున్నారు.


- 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషియల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ఎస్‌సీ–1, ఓఎస్ఎస్‌సీ–2 పరీక్షలు నిర్వహిస్తారు.

సమయం: మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు ఒక పరీక్ష, 2.20 నుంచి 3.20 గంటల వరకు ఒక పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లీష్ పార్ట్–బి మాత్రం 3.30 గంటల నుంచి 3.50 గంటల వరకు నిర్వహిస్తారు.

- 9, 10వ తరగతులకు 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్సు, 5న సోషియల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ఎస్‌సీ–1, ఓఎస్ఎస్‌సీ–2 పరీక్షలు నిర్వహిస్తారు.

సమయం: ఉదయం 9.30 నుంచి 10.15, రెండో పరీక్ష ఉదయం 10.30 నుంచి 11.15 గంటల వరకు నిర్వహిస్తారు ఇంగ్లీష్ పార్ట్–బి మాత్రం ఉదయం 11.30 నుంచి 11.50 గంటల వరకు నిర్వహించనున్నారు

పొరపాట్లకు తావులేకుండా



ఫార్మేటివ్–1 పరీక్ష నిర్వహించిన మాదిరి గానే ఫార్మేటివ్–2 పరీక్ష సక్రమంగా నిర్వహించాలి. పాఠశాలల హెచ్‌ఎంలు ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా నిర్వహించాలి. ఎక్కడ ఏ విధమైనా పొరపాట్లు తలెత్తినా హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

–శ్రీరాం పురుషోత్తం, డీఈవో

ప్రవక్త మార్గం అనుసరణీయం



మిలాదున్నబీ జులూస్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ముస్లిం ప్రముఖులు

కడప కల్చరల్: ప్రార్థనలతో తమ విధేయతను ప్రకటించిన వారికే ప్రవక్త అనుగ్రహం లభించగలదని, ఆయన మార్గం అనుసరణీయమని మత గురువులు, మత పెద్దలు పేర్కొన్నారు. మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జయంతి, మిలాదున్నబీ సందర్భంగా గురువారం కడప నగరంలో అమీనియా బ్లడ్ గ్రూపింగ్ సంస్థ, మిలాదున్నబీ కమిటీలు, ఆంధ్రప్రదేశ్ మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ, కడపశాఖ ఆధ్వర్యంలో మిలాద్ జులూస్ నిర్వహించారు. అగాడివీధిలోని తాలిం మైదానం నుంచి మత గురువు హజరత్ మహమ్మద్ అలీ బొగ్దాది పర్యవేక్షణలో ర్యాలీ

ఘనంగా మిలాద్ జులూస్

సాగింది. ర్యాలీలో మత గురువు హజరత్ సయ్యద్‌షా వలీవుల్లా హుసేనీ సాహెబ్, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, ఆయన సోదరుడు అహ్మద్‌బాషా, కాల్‌టెక్స్ హఫీజుల్లా, సుబాన్‌బాషా, స్థానిక ముస్లిం ప్రముఖులు, అన్ని పార్టీలకు చెందిన ముస్లిం నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న యువకులు ప్రవక్త ఘనతను గురించి నినాదాలు చేస్తూ సాగారు. ర్యాలీ ఆకుపచ్చ పతాకాల రెపరెపలతో నిండుగా సాగింది. గుంతబజారు మసీదు వద్దకు చేరుకున్న అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై మత గురువులు ప్రవక్త జీవితం గురించి, ఆయనను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఆయన రావడంతో ప్రపంచానికి ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఫ్తీ న్యామతుల్లా తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం

రాయచోటి: గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయమని జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం అన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో గురువారం గుర్రంజాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అధికారులు గుర్రం జాషువా ఫొటోకి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ గుర్రం జాషువా గబ్బిలం వంటి తన రచనలు ద్వారా అణగారిన వర్గాలకు ఎన్నో సేవలందించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు సహదేవ రెడ్డి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నాగరాజ, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అబ్సోలం, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

మారిన కాలంలో కళ్ల కలకలం

- మదనపల్లెలో ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్న చైతన్యకు కళ్ల కలక వచ్చింది. హాస్టల్‌లో ఉండటంతో అతనితో పాటు ఇతర విద్యార్థులకు సోకింది.
- కురబలకోట మండలం అంగళ్లులో ఒకే కుటుంబంలో ఇద్దరికి కళ్ల కలక వ్యాప్తించింది. దీంతో సమీపంలోని వారికి సోకింది.

- వాతావరణ మార్పులతో వైరస్ వ్యాప్తి
- విద్యా సంస్థలను కలవరపెడుతున్న కలక

మదనపల్లె సిటీ: సర్వేంద్రియానం నయనం ప్రధానం, కళ్ల మనకు ప్రపంచాన్ని పరిచయం చేసే ప్రధాన జ్ఞానేంద్రియం. కళ్లను ఎంత జాగ్రత్తగా చూసుకుంటే అంత అద్భుతంగా ఈ ప్రపంచాన్ని ఆస్వాదించగలం. అందుకే మన కళ్లను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

- అన్నమయ్య జిల్లాలో కొన్ని రోజుల నుంచి చాలామంది పిల్లలు, కొంతమంది పెద్ద వాళ్లల్లో కళ్లకలక సమస్య ప్రారంభమై వేగంగా వ్యాపిస్తోంది. మదనపల్లె జిల్లా ఆస్పత్రికి కళ్ల కలకతో బాధపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ అధికమవుతోంది. ఇప్పటి వరకు మదనపల్లి ఏరియా ఆస్పత్రిలో 285మంది కళ్లకలక రోగులు చికిత్స పొందినట్లు వైద్యులు తెలిపారు. వీరు కాకుండా మరింత మంది మదనపల్లి, తంబళపల్లి, కురబలకోట నుంచి వచ్చి ఎక్కువమంది ఇతర ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జిల్లాలో వేగంగా విస్తరించడంతో వైద్యులు అప్రమత్తమయ్యారు.




ఎలా వస్తుంది: కళ్ల కలకను ఇంగ్లీషులో కంజక్టివిటిస్ అంటారు. కనుగుడ్డు చుట్టూ ఉండే తెల్లని పొర, కంటి రెప్పల వెనకుండే పొరను కంజెటైనా అంటారు. కళ్లల్లో దుమ్ము, దూళి, వేడి, చలి, వాతావరణంలో తేమ మన కంటిపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఈ వాతావరణ ప్రభావంతో కంటిలో వైరస్, బ్యాక్టీరియాల వల్ల ఇన్‌ఫెక్షన్‌కు దారి తీయవచ్చు. ఈ ఇన్‌ఫెక్షన్ సోకితే దానినే కళ్ల కలక అంటారు. దీనినే పింక్ ఐ అంటారు.

లక్షణాలు: తీవ్రమైన గాలులతో కూడిన నిరంతరం వర్షాలు, లేదా వాతావరణంలో మార్పులతో గాలిలో బ్యాక్టీరియా, వైరస్ క్రిములు విపరీతంగా పెరిగి అతి సున్నితమైన కళ్లపై ప్రభావం చూపుతాయి. ఈ వైరస్, బ్యాక్టీరియా ప్రభావంతో కళ్ల కలకలసమస్య మొదలవుతుంది. 5 నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు జ్వరం కూడా వస్తుంది. ఈ వ్యాధి త్వరగా వ్యాపిస్తుంది. కన్నుఎర్రగా మారడం, కంటి నుంచి నీరు కారడం, కంటి రెప్పలవాపు, నిద్రలేచినప్పుడు కళ్ల రెప్పలు అంటుకుపోవడం, కంటి నొప్పి దురద, మంట వంటి లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. బ్యాక్టీరియా వల్ల సంభవిస్తే వారం రోజుల పాటు, వైరస్ వల్ల సంభవిస్తే మూడు వారాల పాటు ప్రభావం ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పరిసరాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఎవరైనా కళ్లకలకతో బాధపడుతుంటే దూరంగా ఉండడం, వారు వాడిన వస్తువులు (టవళ్లు, దుప్పట్లు, సబ్బులు తాకడం వాడడం) వాడరాదు. తరచుగా సబ్బుతో, హ్యాండ్ వాష్‌తో చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు. కళ్లద్దాలు వాడడం ద్వారా ఇతరులకు వ్యాపించకుండా అరికట్టవచ్చు. ఇది సాధారణ వ్యాధి అయినప్పటికీ ప్రారంభంలోనే గుర్తించి వైద్యం చేయించుకోవడం ద్వారా ప్రభావం తగ్గించుకుని త్వరగా నివారించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

సీజన్ ప్రభావంతోనే..



అర్హత గల నేత్రవైద్యుడిని సంప్రదించి వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు. నేత్ర వైద్యుల పర్యవేక్షణలో యాంటీబయాటిక్ ఐడ్రాప్స్, లూబ్రికెంట్ ఐ డ్రాప్స్ మందులు వాడుకోవాలి. సొంత వైద్యం జోలికి పోవడం ద్వారా కళ్ల మీద రోగ ప్రభావం తీవ్రమై కంటి చూపు మందగిస్తుంది. వైద్యం అశ్రద్ధ చేయడం వల్ల కంటి రెటినాపై చెడు ప్రభావం చూపించే అవకాశం ఉంటుంది. నల్లటి అద్దాలు పెట్టుకోవడం మంచిది. ఒకటి, రెండు వారాల్లో తగ్గిపోతుంది.

– డాక్టర్ సుభాషిణి, కంటి వైద్య నిపుణురాలు, మదనపల్లి జిల్లా ఆస్పత్రి

క్లుప్తంగా

బాలిక అదృశ్యం

ములకలచెరువు : మండలానికి చెందిన ఒక మైనర్ బాలిక అదృశ్యమైనట్లు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ గాయత్రి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సారగుండ్లపల్లెకు చెందిన మైనర్ బాలిక (16) ఇంటి నుంచి పనుల మీద బయటకు వెళ్లింది. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులను విచారణ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

అఖిల భారతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం


పసుపులేటి శంకర్

నందలూరు (రాజంపేట) : నందలూరు వాసి, రాజంపేట సెకండ్ క్లాస్ న్యాయాధికారి పసుపులేటి శంకర్‌కు ఈ నెల 30వ తేదీ తిరుపతిలో జరగనున్న అఖిల భారతీయ కవి సమ్మేళనకు ఆహ్వానం అందినట్లు గురువారం ఆయన విలేకరులకు తెలిపారు. తిరుపతి నగరం రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు సమావేశ మందిరంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులచే సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. శని, ఆది వారాలలో రెండు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమానికి కవులే కాకుండా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా హాజరు కానున్నట్లు ఆయన వివరించారు.

సంవేదనలో సరికొత్త ఉదయం

- సాయితేజ భార్య శ్యామలకు ప్రభుత్వ ఉద్యోగం
- ఎకరా 98 సెంట్ల ప్రభుత్వ భూమి మంజూరు
- ఇది వరకే రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లింపు
- వీర జవాన్ కుటుంబాన్ని ఆదుకున్న సీఎం జగన్


సాయితేజ భార్య శ్యామలకు భూమి మంజూరు గురించి తెలియజేస్తున్న కురబలకోట తహసీల్దారు భీమేశ్వరరావు


సైనిక వీరుడు సాయితేజ (ఫైల్)

కురబలకోట : దేశ సరిహద్దుల్లో సేవలందిస్తూ ప్రమాదంలో మృతి చెందిన వీర జవాన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. వీర జవాన్ లాన్స్ నాయక్ సాయితేజ హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో అశువులు బాశారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని అప్పట్లో చెప్పిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హామీ నెరవేర్చుకున్నారు. సాయితేజ భార్యకు ఉద్యోగం, స్థలం, పరిహారం అందించి వారి కుటుంబానికి బాసటగా నిలిచారు. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ఎగువ రేగడపల్లెకు చెందిన సాయితేజ త్రివిధ (సిడీఎస్)దళాధిపతి బిపిన్‌రావత్ వ్యక్తిగత భద్రత బృందంలో కీలక సభ్యుడిగా పనిచేశారు. 2021 డిసెంబరు, 8న తమిళనాడులో సైనిక హెలిక్యాప్టర్ కూలిన ప్రమాదంలో సాయితేజ (27) అర్ధంతరంగా అశువులు బాసిన విషయం విదితమే. ఆయన అంతిమ యాత్రలో వేలాది మంది పాల్గొని నివాళులర్పించారు. ఇతడికి భార్య శ్యామలతోపాటు మోక్షజ్ఞ, దర్శిని ఇద్దరు పిల్లలు. సాయితేజ ఆకస్మికంగా దూరం కావడంతో అతడి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. అప్పట్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి ఎగువ రేగడపల్లెకు వెళ్లి కుటుంబాన్ని ఓదార్చారు. ఆ కుటుంబానికి ఆదుకుంటామని గట్టి హామీ ఇచ్చారు.

వీర జవాన్ భార్యకు ఉద్యోగం

సాయితేజ మరణం తర్వాత ఆయన కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచింది. అప్పటికప్పుడే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కు అందించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం, భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సాయితేజ భార్య బి.శ్యామలకు ప్రభుత్వ ఉద్యోగం, ఎకరా 98 సెంట్ల(దాదాపు రెండు ఎకరాలు) డికేటీ భూమి మంజూరు చేయించారు. బీకాం కంప్యూటర్స్ డిగ్రీ చదువుకున్న ఆమె ఇటీవలే తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. ఒక వైపు ఉద్యోగం మరో వైపు భూమిని మంజూరు చేయడంతో సాయితేజ భార్య శ్యామల జీవితంలో వెలుగులు నిండాయి. ఆమె భవిష్యత్తుకే కాకుండా జీవితానికి భరోసా ఏర్పడింది.

మరువలేని సైనిక వీరుడు సాయితేజ



సాయితేజ దేశ భద్రతా విభాగంలో పని చేయడం నియోజకవర్గానికి గర్వకారణం. ఆయన మరణానంతరం అతడి భార్య శ్యామలకు ఉద్యోగం ఇవ్వడంతో పాటు భూమి ఇవ్వడం సంతోషం. సైనిక సంక్షేమం కోసం సీఎం జగన్ పెద్దపీట వేస్తారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవడంలో ప్రత్యేక చొరవ చూపి గొప్ప మనసు చాటుకున్నారు.

– పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, తంబళ్లపల్లె

రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా ..



ఆర్మీ సిపాయిగా ఎంపికై లాన్స్ నాయక్‌గా, పారా కమెండోగా ఎదిగి దేశ త్రివిధ దళాధిపతి బిపిన్ రావత్ భద్రతా బృందంలో కీలక సభ్యుడిగా సాయితేజ ఎదగడం ఆషామాషీ కాదు. ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివి. ఆయన మరణానంతరం వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటోంది. భూమి మంజూరు పత్రాలు అతి త్వరలో అందజేస్తారు.

– ఎం.భీమేశ్వరరావు, కురబలకోట తహశీల్దారు

జీవితాన్ని నిలబెట్టారు



సీఎం జగన్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఉద్యోగం, స్థలం ఇచ్చి నా కుటుంబాన్ని ఆదుకున్నారు. భర్త దూరమై చిన్న బిడ్డతో దిక్కు తోచనిస్థితిలో ఉన్న నా జీవితంలో వెలుగులు నింపారు. తమ ఆడబిడ్డలా చూసుకుని ఆదరించారు. జీవితాంతం వారి సహకారం మరువలేను.

– బి.శ్యామల, సాయితేజ భార్య, ఎగువరేగడ పల్లె, కురబలకోట మండలం

విదేశీయుల వివరాలు తెలియజేయాలి


ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : వివిధ దేశాల నుంచి వచ్చిన విదేశీయులకు జిల్లాలో ఆశ్రయం కల్పించిన వారు వారి వివరాలు విధిగా ఆన్‌లైన్ ద్వారా బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ పోర్టల్‌లోని ఫాం-సీలో నమోదు చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పుణ్యక్షేత్రాలు, వైద్య, ఇంజినీరింగ్ కళాశాలలు, అనాథ శరణాలయాలు, టూరిజం ప్రాంతాలు వుండటంతో వివిధ దేశాల నుంచి విదేశీయులు వస్తుంటారని ఆయన పేర్కొన్నారు. అలాంటి వారికి స్థానికంగా వున్న ప్రజలు, లాడ్జీలు, అతిథి గృహాలు, రిసార్ట్స్ వంటి వాటిల్లో ఆశ్రయం కల్పిస్తే సెక్షన్ 16(7) ఆఫ్ ఫారినర్స్ అమెండ్మెంట్ ఆర్డర్ 2016 ప్రకారం (హెచ్‌టిటిపిఎస్://బిఓఐ.జిఓవి.ఐఎన్)లోని ఫారం-సి లో నమోదు చేయాలన్నారు. సమాచారం ఇవ్వకుంటే సెక్షన్14(సి)ఆఫ్ ఫారినర్స్‌యాక్ట్ 1946 మేరకు శిక్షార్హులని, సంబంధిత వ్యక్తికి ఐదేళ్లపాటు జైలు శిక్ష వుంటుందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో వుంచుకుని విదేశీయులకు ఆశ్రయం ఇచ్చినవారు/ కల్పించిన వారు 24 గంటలలోపు సమాచారం అందించాలని, ఇతర వివరాలకు జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక బ్రాంచి విభాగం అధికారి (కె. అశోక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, కడప, సెల్ నంబర్: 9121100652)ను సంప్రదించాలని ఎస్పీ వివరించారు.

నవోదయ విద్యాలయాలకు విశ్వం విద్యార్థుల ఎంపిక


ఎన్.తనీష్


కె.నీలేష్‌రోషన్


వై.రుహాన్సీ


ఈ.జనిత్

తిరుపతి ఎడ్యుకేషన్ : 2023–2024వ విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యార్థులు ప్రతిభ చాటారు. మొదటి జాబితా ఫలితాల్లో 42 మంది, రెండో జాబితా ఫలితాల్లో ఏడుగురు జవహర్ నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించినట్లు ఆ విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండో జాబితాలో ఎన్.తనీష్, కె.నీలేష్ రోషన్, వై.రుహాన్సీ, ఓంకార్, ఈ.జనిత్ ఎంపికై నట్లు పేర్కొన్నారు. వారిని అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసి తదితరులు అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో 9 మందికి గాయాలు


తీవ్రంగా గాయపడిన మల్లికార్జున

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది గాయపడి, స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన మహమ్మద్ రజాక్ (45), అతని చెల్లెలు సాహిరాభాను(40)తోపాటు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం వ్యక్తిగత పనులపై తిరుపతికి వెళ్లారు. తిరిగి రాత్రి కారులో మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యలోని మదనపల్లె మండలం ఎనుములవారిపల్లె పెట్రోల్‌బంక్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో మహమ్మద్ రజాక్, సాహిరాభాను, వారి కుటుంబ సభ్యులు మహమ్మద్‌సైఫ్(16), సోహెబ్(10), హసీనా(13) గాయపడ్డారు. వీరిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

- మదనపల్లె పట్టణం బాలాజీనగర్‌కు చెందిన రాహుల్(27) రామారావుకాలనీ వద్ద రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాహుల్ తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.
- గుర్రంకొండ పట్టణం జగన్‌కాలనీకి చెందిన షేక్ అహ్మద్‌బాషా అతని భార్య షేక్ నగీనా(25), ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో నగీనా తీవ్రంగా గాయపడగా, వెంటనే స్థానిక సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు చికిత్సలు అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.
- తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లెకు చెందిన క్రిష్టప్ప కుమారుడు కె.మల్లికార్జున(54) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో కోసువారిపల్లెకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. గ్రామ సమీపంలోని సత్రం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లి పోయింది. ఈ ప్రమాదంలో మల్లికార్జున తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.
- పట్టణంలోని బసినికొండకు చెందిన లక్ష్మయ్య కుమారుడు ఎస్.పరుశురాం (34) అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డుపైకి రాగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కడప రాయుని పవిత్రోత్సవాలు


దేవతా మూర్తులకు పవిత్రాల అలంకారం

కడప కల్చరల్ : కడప రాయుడు శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలలో భాగంగా మూడవరోజు గురువారం విశేష పూజోత్సవాలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్ బృందం పూజ కార్యక్రమాలు నిర్వహించాయి. ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఉదయం అలంకార మూర్తులైన స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు పవిత్రాల సమర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగిన ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించి ఊరేగింపుగా పవిత్రాలను తెచ్చి పూజల కోసం వేద పండితులకు అందజేశారు. కలశాలను వేదికపై కొలువుదీర్చిన స్వామి ఉత్సవ మూర్తి వద్ద పవిత్రాల ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

హోరాహోరీగా వన్డే క్రికెట్ టోర్నీ


వంశీకృష్ణ, సెంట్రల్‌జోన్, (122 పరుగులు)


చెన్నారెడ్డి, సౌత్‌జోన్, (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. గురువారం నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో విజయనగరం, సెంట్రల్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్‌జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. జట్టులోని వంశీకృష్ణ 122 పరుగులు చేశాడు. విజయనగరం బౌలర్ వాసు 4, దీపుభార్గవ్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 49.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసింది. జట్టులోని తేజ 85, రవికిరణ్ 88 పరుగులు చేశారు. దీంతో విజయనగరం జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.


కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో నెల్లూరు, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 49.2 ఓవర్లలో 268 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఫర్హద్‌ఖాద్రి 78, రోషన్‌పవన్‌కుమార్ 62 పరుగులు చేశారు. నార్త్‌జోన్ బౌలర్లు వంశీనారాయణ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 45.2 ఓవర్లలో 217 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రాహుల్ 80 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు మాధవ్ 4, సాకేత్‌రామ్ 3 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 51 పరుగుల తేడాతో విజయం సాధించింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా, సౌత్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణాజట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 20.5 ఓవర్లలో 79 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని విశాల్ 23 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు చెన్నారెడ్డి 5, విజయభువనేంద్ర 2, ఇస్మాయిల్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు 14.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని భవానీప్రసాద్ 34 పరుగులు చేశాడు. దీంతో సౌత్‌జోన్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మదనపల్లె : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పట్టణంలోని వారపుసంత వద్ద మీసేవ సెంటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. టుటౌన్ పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అయితే మృతుడు స్థానికుడు కాదని, ఎక్కడి నుంచి వచ్చాడో తెలియని చెప్పడంతో, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 50–60 మధ్య వయసు ఉంటుందని, అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. నిలువుగీతల నీలిరంగు షర్టు, ముదురు నేవీ బ్లూ కలర్ గీతల ప్యాంటు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతుని వివరాలు కనుగొనేందుకు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రిమ్స్ మార్చురీలో వృద్ధురాలి మృతదేహం


గుర్తుతెలియని వృద్ధురాలు

కడప అర్బన్ : కడప నగర శివారులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మార్చురీలో గుర్తు తెలియని వృద్ధురాలు సావిత్రమ్మ (65) మృతదేహం వుంది. ఈమెను అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం వత్తలూరు నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా ఈ నెల 24న కడప రిమ్స్‌లో చేర్పించినట్లు రికార్డుల్లో ఉంది. గురువారం ఉదయం 8:39 గంటలకు మృతి చెందింది. ఈమె కోసం ఎవరూ రాలేదు. ఈమె ఆచూకీ తెలిసిన వారు తమను నేరుగా సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన సుబ్బలక్ష్మి


ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసులురెడ్డి

చెన్నూరు : చెన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాదర్‌ఖాన్ కొట్టాలు గ్రామానికి చెందిన వివాహిత రాయచోటి సుబ్బలక్ష్మి (40) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాదర్‌ఖాన్ కొట్టాలు గ్రామానికి చెందిన పెద్దరాజుతో అలంఖాన్ పల్లి గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మికి 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు బేల్దార్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దరాజు మద్యానికి బానిసై రోజూ భార్యను వేధించేవాడు. దీనికి సంబంధించి ఆమె అత్తమామలు కుమారుడిని సమర్థించే వారు. ఈ క్రమంలో ఆమె జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని..

వీరపునాయునిపల్లె : మండలంలోని యన్ పాలగిరికి చెందిన ముతుకూరు శ్రీనివాసులురెడ్డి(58) గురువారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కుల్లాయప్ప, ఏఎస్సై రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులురెడ్డి కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి నిత్యం కోపంగా ఉంటూ, ప్రజలను తిట్టడం లాంటి చర్యలకు పాల్పడే వాడు. ఈ క్రమంలో వీరపునాయునిపల్లెకు వచ్చి లీటరు పెట్రోల్ కొనుగోలు చేశాడు. కాశినాయన ఆలయం వద్దకు వెళ్లి ప్రధాన రహదారి పక్కనే తనపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే అక్కడ ఉన్న ప్రజలు మంటలను ఆర్పారు. అప్పటికే 60 శాతం శరీరం కాలిపోయింది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. 'నాకు ఆరోగ్యం సరిగా లేదు, అందుకే నిప్పు పెట్టుకొంటున్నాను, నా మృతికి ప్రజలకు కానీ కుటుంబ సభ్యులకు గానీ ఎటువంటి సంబంధం లేదు' అని రాసిన ఉత్తరం సంఘటన స్థలంలో దొరికిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని తెలియజేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఐ, పోలీసులు

ములకలచెరువు : భార్య, మామపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన నిందితుడిని బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ గాయత్రి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దేవులచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన దేవరాజు డబ్బు లావాదేవీలపై భార్య అపూర్వ(25), మామ చంద్రశేఖర్(48)ను ఇటీవల కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితులు తిరుపతిలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. అపూర్వ తల్లి వసంతమ్మ ఫిర్యాదుతో దేవరాజు(32) పైన హత్యాయత్నం కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతన్ని మండలంలోని వేపూరికోట క్రాస్ వద్ద అరెస్టు చేశారు. అనంతరం గురువారం కోర్టులో హాజరుపరచడంతో జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని ఎగువకురవంకకు చెందిన రిటైర్డు ఉద్యోగి ఎం.వెంకటరమణ (65) కుటుంబ సమస్యల కారణంగా బుధవారం రాత్రి ఊరి చివర క్రిమి సంహారిణి మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విదంగా అమ్మచెరువుమిట్ట ప్రాంతానికి చెందిన నారాయణస్వామి భార్య లక్ష్మీదేవి (48) కుటుంబ సమస్యలతో విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. నిమ్మనపల్లికి చెందిన ఓ మైనర్ బాలిక (17) సెల్‌ఫోన్ కోసం తమ్ముడితో గొడవ పడగా సెల్‌ఫోన్‌కింద పడి పగలిపోయింది. దీంతో తల్లిదండ్రులు బాలికను మందలించారు. మనస్తాపం చెందిన ఆ బాలిక క్రిమి సంహారిణి మందు తిని ఆత్మహత్యకు యత్నించింది. బాధితులను వారి కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

నందలూరు (రాజంపేట) : నందలూరు గ్రామ పంచాయతీ నీలిపల్లెలో ఏర్పాటు చేసిన గణేశుని లడ్డూ గురువారం సాయంత్రం జరిగిన వేలం పాటలో రూ.2 లక్షలు పలికింది. 12 కేజీల లడ్డూను అదే గ్రామానికి చెందిన ఉప్పుశెట్టి నరసయ్య అత్యధిక ధరకు పాడి సొంతం చేసుకున్నాడు. అనంతరం నిమజ్జన కార్యక్రమం గ్రామంలో అత్యంత వైభవంగా జరిగింది.

వ్యక్తి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో నూర్‌మసీద్ సమీపంలో పఠాన్ సద్దాంఖాన్(33)ను హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సద్దాంఖాన్ ఈ నెల 25న హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడి తల్లి పఠాన్ షకీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో కడప తాలూకా సీఐ పి.రాజా, ఎస్ఐ రామకృష్ణలు తమ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. నిందితుడు పఠాన్ బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బబ్లూను గురువారం ఉదయం నరసరామయ్యగారిపల్లెకు వెళ్లే రహదారిలో అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ పి.రాజా వివరాలు వెల్లడించారు. కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రవీంద్రనగర్‌కు చెందిన సాదక్‌వల్లీ రెండవ కుమార్తె ఫర్హానాను, పఠాన్ సద్దాం ఖాన్ ప్రేమించి వివాహం చేసుకున్నాడు. సద్దాం ఖాన్ తన మామ ఇంటి వద్ద నుంచే ఆటో పెట్టుకుని జీవనం సాగించేవాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత 10 ఏళ్ల నుంచి బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బబ్లూ, సద్దామ్ ఖాన్‌తో స్నేహంగా వుంటూ అతని ఇంటికి వస్తూ వెళ్లేవాడు. ఈక్రమంలో సద్దాంఖాన్ భార్య ఫర్హానాతో బాబా ఫక్రుద్దీన్ చనువుగా మాట్లాడుతూ వుండటం గమనించి, అతనిపై అనుమానం పెంచుకుని, కనపడినప్పుడల్లా గొడవ పెట్టుకుని, తన భార్యతో మాట్లాడవద్దని అవమానపరిచేవాడు. దీంతో బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బబ్లూ ఇంకోసారి సద్దాం ఖాన్ తన జోలికి వచ్చి గొడవపెట్టుకుంటే చంపాలని కత్తిని తన దగ్గరగా పెట్టుకున్నాడు. ఈ నెల 25న సాయంత్రం రవీంద్రనగర్‌లో నూర్‌మసీద్ సమీపంలో బుగ్గవంక రక్షణ గోడకు ఆనుకుని నిర్మాణంలో వున్న ఇంటికి దగ్గరగా సద్దాంఖాన్, అతని స్నేహితుడు షమీవుల్లాకు.. బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బబ్లూ, అతని స్నేహితుడు రాజేష్‌లు ఎదురుపడ్డారు. ఈక్రమంలో ఇద్దరు పరస్పరం దూషించుకుంటూ, గొడవపడ్డారు. అప్పటికే తన వద్ద పెట్టుకున్న కత్తితో బాబా ఫక్రుద్దీన్.. సద్దాం ఖాన్‌పై దాడి చేసి పొడిచాడు. తీవ్ర గాయాలతో కొంతదూరం పారిపోయే ప్రయత్నం చేసి మురుగు కాలువలో పడిపోయాడు. అదే అదనుగా బాబా ఫక్రుద్దీన్ మరలా వెళ్లి దారుణంగా హత్య చేశాడు. వీరిని విడిపించేందుకు ప్రయత్నించిన ఇరువురి స్నేహితులు రాజేష్, షమీవుల్లాలు రక్తాన్ని చూసి పరారయ్యారు. స్థానిక ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ హత్య కేసును వారు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు.